రంజాన్ సందడి షురూ..

- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన మక్కా మసీదు
- పెరిగిన పండ్ల గిరాకీ


చార్మినార్ వద్ద ఖర్జూరం పండ్లు ఖరీదు చేస్తున్న ముస్లిం మహిళలు

చార్మినార్: పాతబస్తీలో రంజాన్ సందడి మొదలైంది. ఎటుచూసినా రంజాన్ మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. ముస్లింలు నెల రోజుల పాటు నిర్వహించే కఠోర ఉపవాస దీక్షల సందర్భంగా ప్రతిఒక్కరూ పండ్లు తీసుకుంటుండడంతో పాతబస్తీలో వివిధ రకాల పండ్లకు గిరాకీ పెరిగింది. కఠోర ఉపవాస దీక్షల అనంతరం ప్రతిరోజూ సాయంత్రం ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. దీనికి ముందు ఖర్జూరం పండుతో ఉపవాస దీక్షలను విరమిస్తారు. దీంతో ఖర్జూరం పండ్లకు గిరాకీ ఎక్కువ ఉంటుంది. ఒకరోజు ముందుగానే తమకు కావాల్సిన వస్తువులను ఖరీదు చేయడంలో ముస్లింలు నిమగ్నం కావడంతో పాతబస్తీలోని ప్రధాన మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. ఇప్పటికే మక్కా మసీదును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ విద్యుత్ దీప కాంతుల్లో మెరిసిపోతున్న మక్కా మసీదుతో పాటు పరిసరాల్లో రంజాన్ మార్కెట్ సందడి కనిపిస్తోంది. నెల రోజుల పాటు మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నట్లు మక్కా మసీదు సూపరింటెండెంట్ ఎంఏ ఖదీర్ సిద్దిఖీ తెలిపారు. వజూ నిర్వహించడానికి మక్కా మసీదు ప్రాంగణంలోని కొలను ఇప్పటికే శుభ్రం చేయించి ఆకట్టుకునే విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు. రంజాన్ మార్కెట్ సందర్భంగా చార్మినార్ కట్టడాన్ని సందర్శించే పర్యాటకులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకున్నారు. అవసరమైన మేరకు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు.

నెల రోజుల పాటు కట్టుదిట్టమైన బందోబస్తు..



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు మక్కా మసీదుతో పాటు పరిసరాల్లో బందోబస్తును కట్టుదిట్టం చేశాం. గతంలో జరిగిన ఘటన నేపథ్యంలో భద్రతను మరింత పెంచాం. అనుమానితుల కదిలికలపై ఎప్పటికప్పుడు నిఘా ముమ్మరం చేస్తాం. మక్కా మసీదులోని అన్ని సీసీ కెమెరాలు పని చేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నాం.

– సాయి చైతన్య, దక్షిణ మండలం డీసీపీ

పాతబస్తీలో ఉచిత పార్కింగ్ సౌకర్యం..



రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా మక్కా మసీదులో జరిగే సామూహిక ప్రార్థనలతో పాటు తరావీలకు ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఇందులో కొంత మంది దూర ప్రాంతాల నుంచి వాహనాలపై వస్తుంటారు. వీరందరి సౌకర్యార్థం మక్కా మసీదు–చార్మినార్ పరిసరాల్లో 11 ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చాం. ఉచితంగా కొనసాగే ఈ పార్కింగ్ సౌకర్యం 24/7 అందుబాటులో ఉంటుంది.

– శ్రీనివాస్ రావు, దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ

క్లుప్తంగా

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం


ఏసీపీ సంజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మెట్టు వెంకటేష్ తదితరులు

అబిడ్స్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమిస్తామని సైఫాబాద్ డివిజన్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల్లో స్నేహభావాలు, మమతానురాగాలు పెరిగేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎంతో దోహదపడుతుందన్నారు. సైఫాబాద్ ఏసీపీగా నియమితులైన ఆర్.సంజయ్‌కుమార్‌ను నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాస్ ముదిరాజ్, అభిమన్యుసింగ్, రాజేష్‌కుమార్ యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి


గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ సోదరీమణుల శిష్యబృందంలో ఒకరైన విదూషి బి.లలితను స్మరిస్తూ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించిన సంగీత గాత్ర కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. హైదరాబాద్ సిస్టర్‌గా పేరుగాంచిన బి.హరిప్రియ ఆధ్వర్యంలో వారి శిష్యబృందం ఆలపించిన కర్ణాటక సంగీత శాస్త్రీయ గానం మంత్రముగ్ధులను చేసింది. శ్రీ సుబ్రమణ్య నమస్తే, థిల్లాన, పాలయమామ్ రుక్మిణీనాయికలతో పాటు చెన్నై, బెంగళూర్ నుంచి వచ్చిన కళాకారులు ఆలపించిన కృతులు సమ్మోహన పరిచాయి.

తట్టు వ్యాధిపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా

గోల్కొండ: తట్టు వ్యాధి చిన్న పిల్లలతో పాటు యుక్త వయస్సులో వచ్చే వ్యాధి అని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. గురువారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో కార్వాన్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో తట్టు వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు తట్టుపై ఉన్న అపోహలను తొలగించాలని ఆయన సూచించారు. తట్టు సోకిన వారికి ఇప్పటికీ చాలా మంది ఇంట్లోనే సొంత పద్ధతులను అవలంభిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ ఖాజ్ రవూఫ్ ఉద్దీన్, కార్వాన్‌కు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్

జియాగూడ: జియాగూడలోని మహంకాళి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ గౌడుగు ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో 24వ వార్షికోత్సవ వేడుకలను చేపట్టారు. ముందుగా ఆలయ మహంకాళి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, యజ్ఞ మహోత్సవం, సత్యనారాయణ వ్రతం, అఖండ హారతి, చివరగా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, శ్రవణ్‌కుమార్, బాలకృష్ణ, అర్చకులు భరద్వజ, ఆకుల సుదర్శన్ ముదిరాజ్, అరవింద్, బీజేపీ నాయకుడు మనోహర్ ప్రసాద్ థాత్రే, అరవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

చాంద్రాయణగుట్ట: తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సిట్ విచారణ ఉన్న నేపథ్యంలో ఓల్డ్‌సిటీ యూత్ కాంగ్రెస్ నాయకులు, సిటీ కాంగ్రెస్ నాయకులు శైలేందర్ యాదవ్, బోయిడి నరేష్, మామాడాల శ్రీనివాస్, నవీన్, సందీప్, పవన్, మహానంద్, రమేశ్‌లను ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం ఛత్రినాక పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్ మండలానికి చెందిన 185 మంది షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ ఫలక్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ పథకం ద్వారా మంజూరైన డబ్బులను కేవలం ఆడపిల్ల పెళ్లి కోసమే వాడాలని స్పష్టం చేశారు. ఈ నిధులు దుర్వినియోగం చేసిన విషయం తనకు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అంతేకాకుండా పథకానికి దరఖాస్తు చేసుకున్నా కూడా మంజూరు కానివారు ఆ విషయాన్ని తన దృష్టికి తేవాలని ఆయన అన్నారు. సంబంధిత దరఖాస్తు జిరాక్సు కాపీలతో మేరాజ్ కాలనీలోని తన కార్యాలయానికి వస్తే తగిన సూచనలు, సలహాలు ఇస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, సయ్యద్ జబ్బార్, మజీద్‌తో పాటు షేక్‌పేట్ మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్ర, రాష్ట్రాల్లో కక్ష సాధింపు పాలన'


ముఖ్య నేతలతో కలిసి మౌన దీక్షలో పాల్గొన్న వెంకటేశ్

గౌలిపురా: కేంద్ర, రాష్ట్రాల్లో కక్ష సాధింపు పాలన కొనసాగుతుందని.. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. సూరత్ కోర్టు రాహుల్ గాంధీపై ఇచ్చిన తీర్పునకు నిరసనగా గురువారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి మౌన దీక్ష నిర్వహించారు. దేశానికి కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీపై కావాలనే బీజేపీ ప్రభుత్వం తీర్పులు ఇప్పిస్తుందని.. తమకు న్యాయ వ్యవస్థపై నమ్మకముందన్నారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడుతుందని.. ఆరాచకపాలన సాగుతుందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుకు త్వరలోనే చెక్ పెట్టే రోజు వస్తుందన్నారు. రాహుల్‌గాంధీకి దేశమంతా అండగా ఉంటుందని.. ఇప్పటికే ప్రజల్లో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజల్లో అపహాస్యం అవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వెంకటేశ్ ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతాం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ జితేందర్ సింగ్

అబిడ్స్: విద్యార్థులను చిన్నప్పటి నుంచే అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్ జితేందర్ సింగ్ పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా చిన్నప్పటి నుంచే విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలు, ఇతర రంగాలలో ప్రావీణ్యం చెందే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్లూమ్స్ ట్యాలెంట్ సంస్థ నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులకు ఆయన మెమొంటులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం జితేందర్ సింగ్ మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలిగే విధంగా విద్యార్థులకు నిత్యం కృషి చేస్తున్నామన్నారు.

నాగేందర్‌కు సన్మానం

నాంపల్లి: కొన్ని దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోకుండా మురుగునీటి పైప్‌లైన్ పనులను పునరుద్ధరించిన సందర్భంగా వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ నాగేందర్‌ను నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఫిరోజ్ ఖాన్ ఆదేశాల మేరకు నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నేత వెంకటేష్ నేతృత్వంలో జనరల్ మేనేజరును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సర్దార్, సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


నాగేందర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న దక్షిణ, తూర్పు మండలం డీసీపీ రూపేశ్

సంతోష్‌నగర్: ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ, తూర్పు మండలం డీసీపీ రూపేశ్ అన్నారు. గురువారం చంపాపేట్ భరత్ గార్డెన్‌లో తూర్పు, దక్షిణ మండల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్, శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా.. సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఉత్సవాలకు మైత్రి, పీస్ కమిటీ సభ్యుల సహకారం ఎంతో దోహదపడుతుందన్నారు. రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్, మలక్‌పేట్ ఏసీపీలు మహ్మద్ గౌస్, శ్యాంసుందర్, కంచన్‌బాగ్, సైదాబాద్, చాదర్‌ఘట్, మలక్‌పేట్, డబీర్‌పురా, మాదన్నపేట, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్లు ఆనంద్ కిశోర్, సుబ్బరామిరెడ్డి, ప్రకాశ్ రెడ్డి, శ్రీను, కోటేశ్వర్ రావు, జానయ్య శర్మ, డీఐలు కమల్ కుమార్, గోపాల్, ఎస్సైలు సాయిరాం, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన సదస్సు



సాక్షి, సిటీబ్యూరో: కార్వాన్ ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో గురువారం కార్వాన్‌లోని ముస్తయిద్ పుర బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆయుష్ కిట్స్, రాగి లడ్డూలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం డాక్టర్లు నరేందర్ లక్ష్మీదేవి.. ఫార్మసిస్ట్ లక్ష్మణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాథోడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మజ్లిస్ నాయకుడు హారూన్ ఫరాన్ తదితరులు

క్రీడలతో శారీరక దృఢత్వం

గోల్కొండ: క్రీడలతో శారీరకంగా దృఢత్వం లభిస్తుందని టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకుడు హారూన్ ఫరాన్ అన్నారు. గురువారం గోల్కొండ రేతిగల్లిలోని జూరిస్ అల్ఫా హైస్కూల్ వారు స్పోర్ట్స్ అండ్ ఇస్లామిక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలిచిన వారికి హారూన్ ఫరాన్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారన్నారు. గోల్కొండలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తెలంగాణతో పాటు హైదరాబాద్ జిల్లా స్థాయి పోటీలలో పతకాలు సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ మజ్లిస్ నాయకులు బదర్ ఉద్దీన్, లంగర్‌హౌస్ డివిజన్ మజ్లిస్ నాయకులు వజీ ఉజ్‌జమా, సయ్యద్ రఫత్ హుస్సేన్, మజ్లిస్ సీనియర్ నాయకులు షకీల్ అలీఖాన్, పాఠశాల డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్, ప్రిన్సిపాల్ హుమేరా తదితరులున్నారు.

ఇద్దరు పిల్లలతో సహా గృహిణి అదృశ్యం

సంతోష్‌నగర్: ఇద్దరు పిల్లలతో సహా గృహిణి అదృశ్యమైన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ మోయిన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ వసీముద్దీన్, రయీసా బేగం (28) దంపతులు. వీరికి పర్వీజ్ (2), ఫరాజ్ (6 నెలల) సంతానం ఉన్నారు. ఈనెల 23న రయీసా బేగం తన ఇద్దరు పిల్లలతో కలిసి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భార్య, పిల్లలు కనిపించడం లేదని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులతో కార్పొరేటర్ సమీక్ష

గోల్కొండ: రంజాన్ మాసంలో పారిశుద్ధ్య పనులను వెంటనే నిర్వహించాలని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్‌లో బల్దియా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదుల పరిసరాలు, మసీదులకు వెళ్లే రోడ్లపై చెత్తను ఏ రోజుకారోజు తొలగించాలన్నారు. అదే విధంగా డ్రైనేజీ లీకేజీలను కూడా అరికట్టాలని ఆయన సూచించారు. వెలగని వీధి దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రజనీకాంత్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీనా, విద్యుత్ శాఖ డీఈ అశోక్, పారిశుద్ధ్య సూపర్‌వైజర్ కయ్యూం, సుష్మా, స్థానిక మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


చెన్నకేశవులు (ఫైల్)

నాంపల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసుస్టేషన్ పరిధిలోని హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీలో నివాసం ఉండే చెన్నకేశవులు(58) వృత్తిరీత్యా మెడికల్ దుకాణాన్ని కేపీహెచ్‌బీలో నడుపుతున్నారు. కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నారు. గురువారం ఉదయం హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ వద్ద ఓ గుర్తు తెలియని రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో ఆత్మహత్యకు గల కారణాలను తెలియజేస్తూ ఒక లేఖ లభించింది. నా చావుకు ఎవరూ కారణం కాదు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మానసిక వేదనకు గురయ్యాను. సీఎం కేసీఆర్ అంటే నాకు ఎంతో ఇష్టమని, నా డెత్ సర్టిఫికెట్‌ను నా భార్యకు అందజేయాలంటూ లేఖలో రాశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు యౌముల్ ఖురాన్ సభ

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో మొదటి శుక్రవారం (ఈ నెల 24న) జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభను ఆలిండియా మజ్లిస్–ఇ–ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మక్కా మసీదు నిర్వాహకులు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ఐదు శుక్రవారాల పాటు యౌముల్ ఖురాన్ సభ కొనసాగుతుందన్నారు. మొదటి శుక్రవారం మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో.. ఈనెల 31న రెండో శుక్రవారం సందర్భంగా ఆలిండియా సున్నీ ఉల్మా బోర్డు ఆధ్వర్యంలో.. మూడో శుక్రవారం ఏప్రిల్ 7న మజ్లిస్ బచావ్ తెహ్రీక్ (ఎంబీటీ) ఆధ్వర్యంలో.. నాలుగో, ఐదో శుక్రవారాలు 14, 21వ తేదీల్లో మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు.

బాలికపై అత్యాచారం.. వ్యక్తి రిమాండ్

చాంద్రాయణగుట్ట: బాలికపై అత్యాచారం జరిగిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌దర్వాజా పూల్‌బాగ్‌కు చెందిన రాహుల్(30)కి ఐదేళ్ల కుమార్తె ఉంది. ఆ చిన్నారి వద్దకు ఇంటి సమీపంలోనే ఉండే ఎనిమిదేళ్ల చిన్నారి ఆడుకోవడానికి వస్తుంది. ఇదే అదునుగా భావించిన రాహుల్ ఈనెల 11న ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనారోగ్యానికి గురవుతుండడంతో చిన్నారిని ఆరా తీయగా జరిగిన విషయాన్ని వెల్లడించింది. దీంతో ఈనెల 22న ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భగత్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

జియాగూడ: దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని రాష్ట్ర బీజేపీ గొర్ల కాపరుల సెల్ కో కన్వీనర్ నర్సిములు అన్నారు. ఈ మేరకు గురువారం బలిదాన్‌దీవాస్‌ను పురస్కరించుకుని డివిజన్ ఎస్సీమోర్చా అధ్యక్షుడు సూరత్‌బిడ్ల, ఉపాధ్యక్షుడు రాహుల్‌కుమార్ ఆధ్వర్యంలో సంజయ్‌నగర్, భగత్‌సింగ్ చౌరస్తాలలో వేడుకలు జరిగాయి. లక్ష్మీనారాయణ, వెంకటేష్‌యాదవ్, శివయాదవ్, తులసిదాస్, గుర్రం శివశంకర్ పాల్గొన్నారు.

గౌలిగూడలో..

అఫ్జల్‌గంజ్: సుఖ్‌దేవ్, రాజ్‌గురు, భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ గోషామహల్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం వారి వర్ధంతిని పురస్కరించుకొని గౌలిగూడలోని గురుద్వారాలోని చమన్ వద్ద భగసింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న నందకిశోర్‌వ్యాస్ బిలాల్

సిటీ కాలేజీ ఆధ్వర్యంలో..

చార్మినార్: కోఠి జిల్లా కన్వీనర్ సభావత్ కల్యాణ్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కోఠి జిల్లాలోని సిటీ కాలేజీ ఆధ్వర్యంలో షాహిద్ దివాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఠి జిల్లా కన్వీనర్ సభావత్ కల్యాణ్, కళాశాల అధ్యక్షుడు దిలీప్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ గొప్పతనాన్ని కొనియాడారు. ఎఫ్‌ఎఫ్‌డీ కన్వీనర్ రాహుల్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, నగర ఉపాధ్యక్షులు గణేష్, అనూష, ప్రియా పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్‌లో..

అబిడ్స్: గౌలిగూడలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ బిలాల్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోనుసింగ్, జితేందర్ సింగ్, విష్ణువర్ధన్, జగదీష్, కోటి శైలేష్‌కురుమ, పప్పుమాత్రే, ఈషాబాయి, రాజు యాదవ్, రమణ్‌సాయి, కపిల్ పాల్గొన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి వేడుకల్లో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాలను కొనియాడారు.


భగత్‌సింగ్ చౌరస్తాలలో ..


గౌలిగూడలో.. శ్రీనివాస్ యాదవ్ తదితరులు


సిటీ కాలేజీలో..